బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 10 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## హర్ ఘర్ తిరంగాలో పాల్గొనాలి : ప్రధాని మోడీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో పాల్గొనాలని దేశప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. శుక్రవారం మోడీ తన సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా మార్చేశారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా ప్రచారంలో పాల్గొనాలని దేశప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో మరోసారి హర్ ఘర్ తిరంగా అభియాన్‌ను ఓ చిరస్మరణీయ ప్రజా ఉద్యమంగా మారుద్దామని ప్రధాని మోడీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "నేను నా ప్రొఫైల్ ఫోటోను మారుస్తున్నాను. మీరు మన త్రివర్ణ పతాకాన్ని గౌరవించేందుకు నాతో చేతులు కలపండి" అంటూ మోడీ తన పోస్టులో రాసుకొచ్చారు. స్వాతంత్ర్య మహోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 9 నుంచి దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలనే నినాదాన్ని ప్రారంభించింది. ఇది ఆగస్టు 15తో ముగుస్తుంది. ఈ ప్రచారాన్ని విజయవంతం చేసేందుకు దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలని అధికార బీజేపీ కార్యకర్తలను కోరింది.




# తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

- లక్ష్యం సూచించే ట్యాగ్ లైన్ ఖరారు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- కాలిఫోర్నియాలో ఏఐ యూనికార్న్ కంపెనీ ప్రముఖులతో సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇకపై మన తెలంగాణ రాష్ట్రాన్ని.. తెలంగాణ ఫ్యూచర్ స్టేట్ అని పిలుద్దామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం "ది ఫ్యూచర్ స్టేట్"కు పర్యాయపదంగా నిలుస్తుందని సీఎం ప్రకటించారు. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో టెక్ యునికార్న్ సీఈఓలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించుకొండి. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం" అని పిలుపునిచ్చారు.

'ఇప్పటి వరకు మేము న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, టెక్సాస్‌లో పర్యటించాం. ఇప్పుడు కాలిఫోర్నియాలో ఉన్నాం. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం.. ఆ లక్ష్యాన్ని సూచించే నినాదం ఉంది. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ స్టేట్ నినాదం. టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారు. కాలిఫోర్నియాకు యురేకా అనే నినాదం ఉంది. అయితే మన ఇండియాలోని రాష్ట్రాలకు ఇటువంటి ప్రత్యేక నినాదాలేమీ లేవు. ఇప్పటినుంచి మన తెలంగాణ రాష్ట్రానికి అటువంటి ఒక లక్ష్య నినాదాన్ని ట్యాగ్ లైన్‌గా పెట్టుకుందాం. ఇకపై మన రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్?.. అని పిలుద్దాం..' అని సీఎం ప్రకటించారు. ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాల ను తమ ప్రభు త్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు. ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ యునికార్న్ కంపెనీల వ్యవస్థాపకులు స్వయం గా హైదరాబాద్‌ను సందర్శించాలని మంత్రి ఆహ్వానించారు. అక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలను పరిశీలించాలని కోరారు

# అమన్ సెహ్రావత్‌కు కాంస్యం




- పారిస్ ఒలంపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో పతకం

**బలగం టీవి, పారిస్**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం దక్కింది. భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ సంచలన ప్రదర్శనతో మెరిశాడు. శుక్రవారం జరిగిన కాంస్య పతక పోరులో విజయం సాధించాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో ప్యూర్టోరికోకు చెందిన డేరియన్ క్రూజ్‌తో తలపడిన అమన్ 13-5 పాయింట్ల తేడాతో గెలిచాడు. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్య 6కి చేరగా.. ఒక రజతం, ఐదు కాంస్యాలు ఉన్నాయి.

అమన్ సెహ్రావత్ గురువారం జరిగిన పురుషుల 57 కేజీల క్వార్టర్‌ఫైనల్‌లో అమన్ సెహ్రావత్ 12-0 తేడాతో అల్బేనియాకు చెందిన జెలిమ్‌ఖాన్ అబాకనోవ్‌పై టెక్నికల్ సుపీరియారిటీతో విజయంతో సెమీస్ చేరుకున్నాడు. అయితే, సెమీస్ లో జపాన్‌కు చెందిన రీ హిగుచి చేతిలో ఓడాడు. దీంతో బ్రాంజ్ మెడల్ రేసులో ప్యూర్టో రికోకు చెందిన డారియన్ టోయ్ క్రూజ్‌తో తలపడ్డాడు. అతన్ని అమన్ 13-5 తో ఓడించాడు.

పదేండ్ల వయస్సులో తల్లిదండ్రులను కోల్పోయి తీవ్ర నిరాశ నుంచి ఉదయించే కిరణంగా రెజ్లింగ్ యంగ్ స్టార్ గా ఎదిగాడు అమన్ సెహ్రావత్. అమన్ హర్యానాలోని ఝజ్జర్‌కు చెందిన ప్రతిభావంతులైన భారతీయ రెజ్లర్. 21 సంవత్సరాల వయస్సులోనే అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు సాధించారు. రెజ్లింగ్ ప్రపంచంలో అనేక విజయాలు అందుకున్నారు. అతను రెజ్లింగ్ 57 కిలోల బరువు విభాగంలో పోటీ పడుతున్నాడు. అతని రెజ్లింగ్ కెరీర్ విజయాలు గమనిస్తే.. 2022 ఆసియా క్రీడలలో కాంస్య పతకం, 2023

మిగితా 2వ పేజీలో

# ప్రభుత్వ వైఫల్యం వల్లే సుంకిశాల ప్రమాదం




- అసత్య ప్రచారం చేస్తున్న కాంగ్రెస్
- చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రాజెక్ట్ పనులు చేస్తున్న ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి
- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సుంకిశాల ప్రాజెక్టుపై ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పరిపాలన చేతగాక కెసిఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పారు. సుంకిశాల ప్రమాదం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజి ఉన్నా హైదరాబాద్‌కు నీటికష్టాలు రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం సుంకిశాల ఉపయోగపడుతుందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఎల్ఎలు కె.పి.వివేకానంద, ముఠా గోపాల్‌తో కలిసి కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కృష్ణానదికి నాలుగేండ్లు నీళ్లు రాకపోయినా ప్రాజెక్టుతో ఇబ్బందులు రావని స్పష్టం చేశారు. ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్‌లో నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి లేదని అన్నారు. హైదరాబాద్‌కు 50 ఏండ్లు తాగునీటి అవసరాలకు సరిపడేలా తమ హయాంలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సుంకిశాల ఘటనను ప్రభుత్వం ఎందుకు తొక్కిపెట్టిందని ప్రశ్నించారు. ఆగస్టు 2న ఉదయం 6 గంటలకు ఘటన జరిగితే ప్రభుత్వానికి సమాచారం లేదా..? లేక విషయాన్ని కప్పిపెట్టారా..? అని నిలదీశారు. ఒకవేళ ఈ ఘటన ముఖ్యమంత్రికి తెలియకపోతే అంతకన్నా సిగ్గుచేటు లేదని మండిపడ్డారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదం జరిగిందని, కానీ ఈ ఘటనపై శాసనసభలో ప్రకటన చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం, పర్యవేక్షణ లోపం వల్ల హైదరాబాద్ ప్రజలకు తీరని నష్టం వాటిల్లిందని వాపోయారు.

త్వరత్వరగా పనులు చేయాలని హడావిడిగా గేట్లు పెట్టడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్వహణ లోపంతోనే గోడ కూలిందని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రాజెక్ట్ పనులు చేస్తున్న ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనపై న్యాయ విచారణ చేయాలని అన్నారు. మున్సిపల్ శాఖను తనవద్దే పెట్టుకున్న సిఎం రేవంత్ ఈ ఘటనకు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. మేడిగడ్డలో ఏమైనా జరిగితే కేంద్రం వెంటనే స్పందిస్తుందని,ఎన్‌డిఎస్‌ఎ హడావిడిగా రిపోర్టు ఇస్తుందని కానీ ఇప్పుడు కేంద్రం స్పందించడం లేదు..బిజెపి నాయకులు ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. మేడిగడ్డ ఘటన జరిగినప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఆ ఘటనను తాము దాచిపెట్టలేదని గుర్తుచేశారు.

తమ ప్రభుత్వం సాగు, తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చిందని కెటిఆర్ తెలిపారు. ఎస్-ఎల్‌బిసి టన్నెల్ పనులు కూడా వేగంగా చేశామన్నారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు సరిగ్గా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్లు మార్చడమేనా మార్పు అంటే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులకు సరుకు లేదు.. సబ్జెక్టు లేదని విమర్శించారు. బ్యారేజ్ గేట్లు ఎప్పుడు దించుతారో కూడా తెలియదని చెప్పారు. కాళేశ్వరం ఫెయిలైతే అన్ని రిజర్వాయర్లకు నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో కెసిఆర్‌కు పేరు వస్తుందనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి చేతగాని తనంతోనే ఈ అంశాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. మంచి జరిగితే వారి ఖాతాలో, చెడు జరిగితే తమ ఖాతాలో వేస్తున్నారని విమర్శించారు. సుంకిశాలను త్వరలో బిఆర్ఎస్ బృందం సందర్శిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ నేతల చిల్లర ప్రచారానికి ప్రకృతే సమాధానం చెబుతుందని వెల్లడించారు.

# వరంగల్ ఎంజీఎంలో దారుణం




**బలగం టీవి, వరంగల్**

వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో దారుణం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి సమయంలో వరంగ ల్ ఎంజిఎం ఆసుపత్రి అత్యవసర విభాగం ఆవరణలో నాలుగు రోజుల పసికందును వీధికుక్కలు గుంపుగా పట్టుకొని లాక్కుంటూ దాడి చేసి చెవులు, తల భాగంలో కర్కశంగా కొరుకుతుంటే ఆస్పత్రి సెంట్రల్ ప్రొటెక్షన్ ఫోర్స్ స్టేషన్ కానిస్టేబుల్ చూసి పసికందును కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే పసికందు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పసికందు మృతి చెందిన ఘటన ఆస్పత్రిలోని స్థానికులు అందరి మనసులను కలచివేసింది.

మృతి చెందిన పసికందును కుక్కలు లాక్కొచ్చాయా? మృతి చెందిన శిశువు ఆడనా, మగనా.. అనేది తెలియరావడం లేదు. పసికందును సగం తినడంతో గుర్తుపట్టడం కష్టంగా ఉంది. ప్రాణంతోనే ఉన్న పసికందుపై దాడి చేసి చంపేశాయా..! పసికందు తల్లిదండ్రులు ఎవరు? ఈ శిశువును ఎక్కడి నుండి తీసుకొచ్చాయి.. అనే కోణంలో వైద్యులు, పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ అనంతరం పూర్తి విషయాలు తెలిసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మృతి చెందిన పసికందును ఎంజిఎం మార్చురీలో భద్రపరిచారు.

పిల్లల విభాగం ముందు కుక్కల స్వైరవిహారం వరంగల్ ఎంజిఎం పిల్లల విభాగం ముందు ఆవరణలో రాత్రి వేళల్లో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ పిల్లల అత్యవసర విభాగం మొదటి అంతస్తు మెట్లపై నిద్రిస్తున్నట్లు రోగి అటెండర్లు చెబుతున్నారు. గతంలో పిల్లల విభాగం ఆవరణ ముందు రాత్రి వేళలో కుక్కల దాడిలో ఓ మహిళ నేలపై పడిపోయింది. అక్కడున్న సెక్యూరిటీ గమనించి ఆ మహిళకు కుక్క కాటు నుండి తప్పించి కాపాడారని ఆస్పత్రి సిబ్బంది అన్నారు. రాత్రివేళ ఎంజిఎం అత్యవసర విభాగంలోని కొన్ని వార్డులలో కుక్కలు తిరుగుతున్నట్లు పలువురు రోగులు చెబుతున్నారు. ఎంజిఎం ఆస్పత్రి ఆవరణలో కుక్కల బెడదను నివారించేందుకు శాశ్వత ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని, ఆస్పత్రి సెక్యూరిటీ అప్రమత్తంగా ఉండాలని పలువురు రోగులు కోరుకుంటున్నారు.

## ఆగస్టు 15న

# రైతులను రుణ విముక్తి చేస్తాం..



- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆగస్టు 15న రైతులను రుణ విముక్తి చేస్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2 లక్షల రైతుల రుణ మాఫీ చేస్తాం అని హామీ ఇచ్చామని.. చేసి చూపిస్తున్నామని తెలిపారు. జూలై 15 న జీవో ఇచ్చామని.. 18 జూలైన ఒక లక్ష రూపాయల రుణమాఫీ 6,983 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రెండవ సారీ రూ.6190.02 కోట్లతో జూలై మాసంలో మళ్ళీ విడుదల చేశామన్నారు.

లక్షన్నర వరకు రుణం ఉన్న వాళ్ళందరికి నేరుగా 12289 కోట్లు 16.29 లక్షల కుటుంబాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. రెండు లక్షల వరకు ఆగష్టు 15 లోపు చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో నిబద్ధతతో పని చేస్తున్నామన్నారు. ఆగస్ట్ 15లోపు రుణాలు వైరాలో భారీ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. వైరా నుంచి ఆగష్టు 15న రాష్ట్రంలో రైతులకు రుణ విముక్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చాలెంజ్ చేశారని.... కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం వైరా సభలో రైతులు పండుగ లాగా పాల్గొని మన రైతాంగ సోదరులు మంచి సందేశం ఇచ్చేలా సభ జరుపుతామన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో రుణ మాఫీ ఒక్కటే కాదు... రైతు భీమాకి సంబంధించి ఒక వెయ్యి , 500 కోట్లు రైతుల తరుపున ప్రభుత్వం కడుతుందన్నారు. క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ కూడా చేస్తున్నామన్నారు. రైతులు కట్టాల్సిన రూ.1,350 కోట్లు కడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72 వేల కోట్లు కేటాయించామన్నారు. పండే ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఉద్యానవన పంటలు, డ్రిప్, సింప్సన్‌కు ఆధునీకరణకు నిధులు మంజూరు చేశామన్నారు. రూ.1,450 కోట్లతో పూర్తి చేసే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి సీతారామ పేరు పెట్టి కేసీఆర్ ప్రభుత్వం రూ.23 వేల కోట్లుకు పెంచి దోపిడీ చేసిందని ఆరోపించారు. ఆనాటి నుంచి కాంగ్రెస్ ఖండిస్తూ వస్తోందన్నారు. రూ.8 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఒక ఎకరాకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రుల సమక్షంలో రివ్యూ చేశామన్నారు. తక్కువ ఖర్చుతో నీళ్ళు పారించే విధానంతో అతి తక్కువ ఖర్చుతో కేవలం రూ.75 కోట్లతో లక్షన్నర ఎకరాలు పండించేలా సీతారామ ప్రాజెక్ట్ లింకు కెనాల్‌తో పనులు చేశామన్నారు. ఎన్‌ఎస్‌పీ లింకు , వైరా కెనాల్‌కు లింకు కలపటమే రేపటి కార్యక్రమమని... ఇదీ మా నిబద్ధతకు తార్కాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# 'సీపీగెట్' ఫలితాలు విడుదల



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ సీపీగెట్ - 2024 (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్) ఫలితాలు విడుదలయ్యాయి. అభ్యర్థులు https://cpget.tsche.ac.in వెబ్ సైట్ లోకి వెళ్లి స్కోర్‌తో పాటు ర్యాంక్ కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చు. శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు ఫలితాలు అందుబాటులోకి వచ్చాయి.

**ఫలితాలను ఇలా చెక్ చేసుకోండి**

1: పరీక్ష రాసిన అభ్యర్థులు https://cpget.tsche.ac.in వెబ్ సైట్ లోకి వెళ్లాలి.

2: సీపీగెట్ - 2024 ఫలితాల లింక్ పై క్లిక్ చేయాలి.

3: ఓపెన్ అయ్యే విండోలో హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ తో పాటు పుట్టిన తేదీని ఎంట్రీ చేయాలి.

4: మీ ర్యాంక్ కార్డ్ డిస్ ప్లే అవుతుంది.

5: ప్రింట్ లేదా డౌన్లోడ్ అనే ఆప్షన్ పై నొక్కి కాపీని పొందవచ్చు.

రాష్ట్రంలోని ఉస్మానియా, తెలంగాణ, కాకతీయ, శాతవాహన, పాలమూరు, మహాత్మాగాంధీ, మహిళా యూనివర్సిటీలు, జేఎన్‌టీయూహెచ్ పరిధిలో ఉన్న 297 పీజీ కాలేజీల్లో( ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సు) 51 కోర్సుల్లో ప్రవేశాలకు సీపీగెట్ నిర్వహిస్తున్నారు.సీపీగెట్ పరీక్షలను జూలై 6వ తేదీ నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించారు.జులై 17వ తేదీతో అన్ని పరీక్షలు పూర్తి అయ్యాయి. జులై 6 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో జరిగిన ఈ పరీక్షలకు 73,342 మంది దరఖాస్తు చేసుకోగా.. 64,765 మంది హాజరయ్యారు.

రాష్ట్రవ్యాప్తంగా 44,604 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీపీగెట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీలో ఏ సబ్జెక్టు చేసినా, పీజీలో ఇష్టమొచ్చిన సామాజిక కోర్సుల్లో చేరేందుకు వీలు కల్పిస్తున్నారు. ఎంబీబీఎస్, బీటెక్ విద్యార్థులు కూడా ఎంఏ, ఎంకామ్ వంటి కోర్సుల్లో చేరే వీలుంది. మొత్తం 100 మార్కులకు సీపీగెట్ పరీక్ష నిర్వహించారు.ఈ ఏడాది కూడా ఉస్మానియా వర్సిటే ఈ పరీక్ష నిర్వహించింది.



## ప్రాజెక్టుల పేరుతో దోచుకున్న ప్రభుత్వం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం నాడు ఏన్కూర్ వద్ద సీతారామ ప్రాజెక్ట్ కాలువల నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... రీ డిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుకు రూ. 18వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పనులు చేపట్టి రూ.8 వేల కోట్ల ప్రజల సొమ్మును కాజేసిందని విమర్శించారు. కాళేశ్వరం, ఇరిగేషన్‌లో ప్రజల సొమ్ము లూటీ చేశారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు అన్ని సాగులోకి తెచ్చి రైతులకు ఉపయోగపడాలని శరవేగంగా పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మిగితా 2వ పేజీలో

# నచ్చిన దుస్తులను ధరించే స్వేచ్ఛ ఉండాలి



- హిజాబ్‌పై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

క్యాంపస్‌లో హిజాబ్, బుర్ఖా క్యాప్, నిఖాబ్‌ను నిషేధిస్తూ ముంబయిలోని ఓ కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. నచ్చిన దుస్తుల ధరించే స్వేచ్ఛ విద్యార్థినిలకు ఉండాలని అభిప్రాయపడింది. విద్యా సంస్థలు, విద్యార్థినిల డ్రెస్ కోడ్‌పై బలవంతం చేయలేవని పేర్కొంది. ఈ మేరకు ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠే కళాశాలను నిర్వహిస్తున్న చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీకి నోటీసులను జారీ చేసింది. నవంబర్ 18 లోపు విద్యార్థినిల డ్రెస్ కోడ్‌పై విధించిన నిషేధంపై ప్రతిస్పందనను తెలియజేయాలని కోరింది.

“నచ్చిన దుస్తులను ధరించే అవకాశం విద్యార్థినిలకు ఉండాలి. డ్రెస్ కోడ్‌పై వారిని కాలేజీలు బలవంతం చేయకూడదు. దేశంలో అనేక మతాలు ఉన్నాయని తెలిసి, మీరు అకస్మాత్తుగా ఇలాంటి చర్యలు తీసుకోవడం దురదృష్టకరం. విద్యార్థుల పేర్లు వారి మతపరమైన గుర్తింపును బయటపెట్టట్లేదా.. అలాగని ఇక నుంచి వారిని నంబర్లతో పిలుస్తారా.. విద్యార్థుల మత విశ్వాసాలను బహిర్గతం చేయకూడదనే ఉద్దేశ్యంతో కళాశాల తిలక్(బొట్టు), బిందీలను ఎందుకు నిషేధించలేదు” అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది.

క్లాస్ రూమ్‌లో అమ్మాయిలు బుర్ఖా ధరించరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. క్యాంపస్‌లో ఎలాంటి మతపరమైన కార్యకలాపాలకు అనుమతి లేదని పేర్కొంది. ఈ మధ్యంతర ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే సదరు విద్యా సంస్థ కోర్టుకు వెళ్లేందుకు స్వేచ్ఛ కల్పించింది. అనంతరం దీనిపై కాలేజీకి నోటీసులు జారీ చేసింది. నవంబరు 18లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

క్యాంపస్‌లో హిజాబ్, బుర్ఖా, నిఖాబ్, క్యాప్ వంటివి ధరించకూడదంటూ ముంబయిలోని ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠీ కాలేజీ ఇటీవల ఓ సర్క్యులర్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ కొన్ని విద్యార్థి సంఘాలు బాంబే హైకోర్టును ఆశ్రయించాయి. కళాశాల జారీ చేసిన సర్క్యులర్‌ను బాంబే హైకోర్టు సమర్థించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వారు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హిజాబ్, బుర్ఖా నిషేధం కారణంగా విద్యార్థినిలకు తరగతులకు హాజరుకాలేకపోతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌పై స్టే విధించింది.

# పార్లమెంట్ ఉభయ సభలు నిరవధిక వాయిదా

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. వర్షాకాల సమావేశాలు జూలై 22న ప్రారంభమయ్యాయి. కాగా, ఆగస్టు 12 వరకు పార్లమెంట్ సమావేశాలు జరగాల్సి ఉండగా.. మూడు రోజుల ముందు స్పీకర్ ఓం బిర్లా వాటిని నిరవధికంగా వాయిదా వేశారు. రాజ్యసభ కూడా వాయిదా పడింది. ఆర్థిక బిల్లు ఆమోదం పొందింది. ఈ సమావేశాల్లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కూడా ప్రవేశపెట్టారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తడంతో పార్లమెంటు సంయుక్త కమిటీకి సిఫార్సు చేసింది.



# కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎదురుదాడి సరికాదు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సుంకిశాల ప్రాజెక్టు విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. సుంకిశాలకు సంబంధించిన ఘటనలో పొరపాటును ఒప్పుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. సుంకిశాల ఘటనతో కృష్ణా నదిపై బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల నాణ్యతపై చేయిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే కాళేశ్వరం సుంకిశాల ప్రాజెక్టులను నిర్మించారు. నీళ్ల రాకుండానే కాళేశ్వరం కృంగిపోయింది. నీళ్లు వచ్చిన తర్వాత సుంకిశాల ప్రాజెక్టు మునిగిందని భట్టి విక్రమార్క ఆరోపించారు.

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు అక్కడ కట్టడం సరికాదని కాంగ్రెస్ ముందే చెప్పిన వినకుండా.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని.. ఫలితం ఏంటో ఇప్పుడు అందరం చూస్తున్నామన్నారు. ఇంజనీర్లు చెప్పింది కాదని కేసీఆర్ సొంత నిర్ణయాలు తీసుకొని కాళేశ్వరం కట్టడం వల్లే కుంగుబాటుకు కారణమైంది అని డిప్యూటీ సీఎం భట్టి పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులకు రీడిజైన్ చేసి ఇరిగేషన్ శాఖను బీఆర్ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టుపై ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఒక ఎకరానికి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేదని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామ ప్రాజెక్టు పై పెట్టిన ఖర్చు వృధా కాకుండా ఉండడానికి.. ముఖ్యమంత్రి భద్రాచలం పర్యటనకు వచ్చినప్పుడు ఇంజనీర్లతో కలిసి రాజీవ్ గాంధీ లింకు కెనాల్ ను ప్రతిపాదించామన్నారు. కేవలం 75 కోట్ల రూపాయలతో రాజీవ్ లింకు కెనాల్ ను మూడు నెలల్లో పూర్తి చేసి ఒక లక్ష 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమం చేపట్టామని భట్టి విక్రమార్క తెలిపారు.

# వీధికుక్కల దాడిలో బాలుడి మృతి



- రాయపోల్‌లో నెల క్రితం దాడి.. ఇన్ఫెక్షన్‌తో మృతి
- కోకాపేటలో నిద్రిస్తున్న బాలుడి మర్మాంగంపై దాడి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వీధికుక్కల దాడిలో మరో బాలుడు మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని రాయపోల్‌కు చెందిన శివకుమార్ మాధురి దంపతుల 4 ఏండ్ల కుమారుడు కియాన్ష్ నెల రోజుల క్రితం వీధికుక్కల దాడిలో గాయపడ్డాడు. వెంటనే నగరంలోని దవాఖానలో చికిత్స చేయించగా వైద్యులు కుట్లువేశారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా బాలుడు అనారోగ్యానికి గురికాగా నిలోఫర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నిలోఫర్ ఘటన మరువక ముందే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట సబితానగర్‌లో మానసికస్థితి సరిగాలేని ఓ బాలుడి మర్మాంగంపై కుక్కలు దాడి చేశాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వలసకూలీలు రాజు, అంజమ్మ దంపతుల పెద్దకుమారుడు భరత్ మానసికవైకల్యంతో మంచానికే పరిమితమై య్యాడు. ఇంట్లో మంచంపై పడుకున్న భరత్‌పై వీధికుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా రక్తస్రావం అవుతున్న బాలుడిని నార్సింగిలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం పరిస్థితి కొంతమెరుగ్గా ఉన్నా 48 గంటలు గడిస్తేకానీ చెప్పలేమని వైద్యులు తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని గురువారం ఒకేరోజు ఏడుగురు చిన్నారులపై పిచ్చి కుక్క దాడి చేసింది. శుక్రవారం మరొకరిపై దాడి చేసింది. గ్రామస్థులు కర్రలతో దాడి చేయగా కుక్క మృతి చెందింది.

# అమన్ సెహ్రావత్‌కు కాంస్యం

- పారిస్ ఒలంపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో పతకం

(మొదటి పేజీ తరువాయి)

కజకిస్తాన్‌లోని అస్తానాలో జరిగిన ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

అమన్ సెహ్రావత్ హర్యానాలోని ఝజ్జర్ జిల్లాలోని బీరోహార్ ప్రాంతానికి చెందిన రెజ్లర్. జాట్ కుటుంబానికి చెందిన అమన్.. చిన్నతనంలో అనేక కష్టాలు ఎదుర్కొ న్నాడు. 10 సంవత్సరాల వయస్సులో తన తల్లిని కోల్పో యాడు. ఒక సంవత్సరం తర్వాత తండ్రిని కూడా కోల్పోయాడు. అమన్, అతని చెల్లెలు పూజా సెహ్రావత్ లు వారి పెద్ద మేనమామ సుధీర్ సెహ్రావత్ సంరక్షణలో పెరిగారు. తీవ్ర నిరాశతో మొదలైన అతని జీవిత ముందుకు సాగుతున్న క్రమంలో రెజ్లింగ్‌పై తన అభిరుచిని చూపించాడు. కోచ్ లలిత్ కుమార్ వద్ద శిక్షణ పొందడం ప్రారంభించాడు. అమన్ 2021లో తన మొదటి జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.

అక్కడి నుంచి అనేక పెద్ద టోర్నీలలో విజయాలు అందుకుంటూ యంగ్ స్టార్ రెజ్లర్ గా గుర్తింపు సాధించాడు. 2022 ఆసియా గేమ్స్‌లో 57 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. 2023 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. జనవరి 2024లో, అతను జాగ్రెబ్ ఓపెన్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ క్రమంలోనే పారిస్ 2024 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఒకేఒక్క భారత పురుష రెజ్లర్ గా నిలిచాడు. ఇప్పుడు తనదైన దూకుడు ఆటతో పారిస్ ఒలింపిక్స్ 2024 లో సెమీస్ చేరుకున్నాడు.

# ప్రాజెక్టుల పేరుతో దోచుకున్న ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

సీతారామతో లక్షా 35 వేల ఎకరాలు వైరా, లంకా సాగర్ ప్రాజెక్ట్‌లు మైనర్ ఇరిగేషన్‌లో అనుసంధానం చేస్తున్నామని అన్నారు. ఈ నెల 15వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అడ్డంకులు ఉన్నా అధిగమిస్తామని అన్నారు. లక్షా 75 వేల ఎకరాలు సాగులోకి మొదటి విడతలో తీసుకురాబోతున్నామని చెప్పారు. రైతుల రుణమాఫీ చేశామని తెలిపారు. రూ.లక్షా 50 వేల నుంచి 2లక్షల వరకు బ్యాంకులో రుణం ఉన్న అన్నదాతలకు మాఫీ చేస్తామని, రూ.31వేల కోట్లు రైతులకు ఇచ్చే పరిస్థితి లేదని.. అయినా రైతుల ప్రభుత్వం కాబట్టి రుణమాఫీ చేశామని మంత్రిఅన్నారు.రూ. 2లక్షలకు పైగా రుణాలు దాటిన రైతులు నగదు చెల్లించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇస్తామని అన్నారు. మొదటి విడతగా 4లక్షల ఇళు అందజేస్తామని ప్రకటించారు.

కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తామని అన్నారు. తెల్ల రేషన్ కార్డుల కోసం పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. హెల్త్ కార్డు... తెల్లరేషన్ కార్డులు త్వరలోనే ఇస్తామని ప్రకటించారు.

ధరణి అనే భూతంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దానికి మోక్షం కల్పిస్తామని తెలిపారు. అద్భుతమైన రెవెన్యూ చట్టం తీసుకుని రాబోతున్నామని స్పష్టం చేశారు. 80 వేలు పుస్తకాలు చదివిన దొరవారు సూచనలు చేస్తే పరిశీలించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం ప్రతి ఒక్కరి కలను నెరవేరుస్తుందని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూమి, నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# జీవో-46పై ప్రభుత్వాన్ని వదలం

- బీఆర్ఎస్ పార్టీ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా జీవో-46 అభ్యర్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ వరింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరు తూ జీవో-46 అభ్యర్థులు శుక్రవారం కేటీఆర్‌ను నందినగర్‌లోని నివాసంలో కలిశారు. ఎన్నికలకు ముందు జీవో-46ను రద్దు చేస్తామని నమ్మబలికితే కాంగ్రెస్ పార్టీ గెలిచేందు కు సహకరించామని, అయితే ఆ పార్టీ నాయకులు గెలిచిన తర్వాత తమను పట్టించుకోవ డం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యాత్మకంగా మారిన జీవో-46 అంశంపై తాను గతంలో సీఎస్‌తో మాట్లాడిన విషయాన్ని కేటీఆర్ వారికి గుర్తుచేశారు. ఇందుకోసం బీఆర్ఎస్ నుంచి కావాల్సిన సహకారాన్ని అందిస్తామని అభయమిచ్చారు. ఈ విషయంలో తమ పార్టీ నాయకులు గత కొన్ని రోజులుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు.

అభ్యర్థుల కు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామ ని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోర్టు కేసుల పేరు చెప్పి తప్పించుకుంటూ అభ్యర్థులకు అన్యాయం చేసే ప్రయత్నం మంచిదికాదని హితవు పలికారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ విషయంపై ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ధైర్యమిచ్చిన కేటీఆర్‌కు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జీవో-46 వల్ల తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి చేపట్టే ఉద్యోగ నియామకాలతోపాటు తొమ్మిది శాఖల ఉద్యోగాల భర్తీలో గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు నష్టం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

# జయాబచ్చన్ వర్సెస్ ధన్‌కర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాజ్యసభలో సమాజ్‌వాది పార్టీ ఎంపి జయాబచ్చన్‌కు ఉపరాష్ట్రపతి, సభాధ్యక్షులు జగదీప్ ధన్‌కర్‌కు మధ్య పేరు విషయంలో వాడివేడిగా వాదన జరిగింది. ఇంతకు ముందు అభ్యంతరం తెలిపినప్పటికీ సభాఛైర్మన్ తనను పదేపదే జయా అమితాబ్ బచ్చన్ అని గట్టిగా సంబోంధించడంపై జయా బచ్చన్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తన పట్ల అవహేళన రీతిలో ధన్‌కర్ హావభావాలు ఉన్నాయని, తనను గద్దిస్తున్నట్లుగా ఆయన మాట్లాడారని పేర్కొంటూ జయాబచ్చన్ నిరసన వ్యక్తం చేశారు. జయా బచ్చన్‌కు కాంగ్రెస్ అధినేత్రి , ఎంపి సోనియా గాంధీ సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు మద్దతు తెలిపారు. సోనియా గాంధీ నాయకత్వంలో వాకౌట్‌కు దిగారు. ఈ దశలో ధన్‌కర్ స్పందిస్తూ ప్రతిపక్షాల వైఖరి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి అవమానకరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతకు ముందు సభలో జయాబచ్చన్ మాట్లాడుతూ ధన్‌కర్ సభకు పెద్దగా వ్యవహరించడం లేదని , తన పెద్దరికం ప్రదర్శించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అరిచినట్లుగా మాట్లాడాన్ని వ్యతిరేకించారు. దీనిపై ధన్‌కర్ స్పందిస్తూ ‘ ‘ మీరు నాకు పాఠాలు నేర్పుతారా? , మరో పెద్ద సెలబ్రిటీ కావచ్చు, అయితే ఏం మీరు ఖచ్చితంగా సభా మర్యాద పాటించాల్సి ఉంటుంది’ అని తెలిపారు. తనను ధన్‌కర్ మాట్లాడనివ్వకపోవడం, పైగా ప్రతిపక్ష నేత ఖర్గే మైక్ కట్ చేయడం నిరంకుశం అని జయాబచ్చన్ కోపోద్రిక్తులయ్యారు.

గత వారం బిజెపి సభ్యులు ఘనశ్యామ్ తివారీ ఖర్గే గురించి అనుచిత వ్యాఖ్యలకు దిగారని, ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎంపీలు పట్టుబట్టిన క్రమంలో సభలో గందరగోళం తరువాత రాజ్యసభ అధ్యక్షులకు , ప్రతిపక్షాలకు మధ్య వాగ్యుద్ధానికి దారితీసింది. పోయిన వారం సంగతి ఇప్పుడెందుకు? అయినా తన ఛాంబర్‌లో దీనిపై అందరి మధ్య సయోధ్య కుదిరిందని ధన్‌కర్ తెలిపారు. పైగా తివారీ సభలో ప్రతిపక్ష నేతను ప్రశంసించారని చెప్పారు. తివారీ విషయంపై మాట్లాడటానికి వీల్లేదని, దీనిపై ఎవరిని అనుమతించేది లేదని ఆయన ఖర్గే మైక్ కట్ చేశారు. దీనిపై ప్రతిపక్షాల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. సభాధ్యక్షుల తీరు ఆయన మాట్లాడే పద్ధతి బాగా లేదని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. డిఎంకె సభ్యులు తిరుచి శివ ఈ విషయం ప్రస్తావించారు. ఈ దశలో తాను కూడా దీనిపై మాట్లాడుతానని జయా బచ్చన్ తెలిపారు. ఈ దశలోనే ధన్‌కర్ ఆమెను నమోదిత పేరు జయా అమితాబ్ బచ్చన్ అని సంబోధించడం వివాదానికి మూలమైంది.

తాను కళాకారిణిని అని ఇతరుల హావభావాలను అర్థం చేసుకుంటానని , నొసలు చిట్లించి మాట్లాడటం ఈసడించుకున్నట్లు వ్యవహరించడం అన్ని తెలుసుకుంటానని జయాబచ్చన్ ధన్‌కర్‌పై దాడికి దిగారు. మీ గొంతుచించుకునే పద్ధతి బాగా లేదని చెప్పడానికి చింతిస్తున్నానని అన్నారు. మనమంతా సభలో సహచరులమని, ఇప్పుడు మీరు కుర్చీలో ఉండొచ్చు అంతే తేడా అన్నారు. దీనిపై ధన్‌కర్ ఆగ్రహంతో ఇక్కడికి పాఠాలు చెప్పడానికి వచ్చారా. ఇక చాలించండి అని గదమాయించారు. మీరు యాక్టర్ కావచ్చు. డైరెక్టర్ చెప్పినట్లు చేయాల్సిందే. ఈ స్థానం నుంచి నిర్వహణ ఏమిటనేది మీకు తెలియదన్నారు. ఎంతోదూరం పయనించి ఇక్కడికి చేరిన నన్ను పెద్దగా మాట్లాడవద్దని అంటారా? అని ఎదురుదాడికి దిగారు. ఆయనకు ప్రతిపక్షాలు అడ్డుతగిలాయి. దీనిని పట్టించుకోకుండా ధన్‌కర్ ఇక్కడికి వచ్చిన వారు ఇంతకు ముందు సముపార్జించుకున్న గౌరవాలను ఇక్కడ ప్రదర్శించాల్సిన అవసరం లేదు. ఇక్కడికి వచ్చింది అంతా గౌరవం పెంచుకోవడానికి అని తెలిపారు.

ఈ దశలో టిఎంసి ఎంపి సుష్మితా దేవ్ కలుగచేసుకుని జయాబచ్చన్ ఈ సభలో ఎంపి, ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వాల్సిందే అన్నారు. దీనిపై సభాధ్యక్షులు స్పందిస్తూ సీనియర్ సభ్యులు అయితే ఛెయిర్‌ను అవమానించే విధంగా వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు. తనకు ఎవరూ ఏమి చెప్పాల్సిన పనిలేదని తన పద్ధతి ప్రకారం తాను వెళ్లుతానని చెపుతూ ప్రతిపక్షాల మాటలు రికార్డుల్లోకి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఖర్గేను ఉద్దేశించి మీ హంగామాతో ఒరిగేదేమీ లేదన్నారు.

ఈ దశలో ప్రతిపక్షాలు వాకౌట్‌కు దిగుతూ ఉండగా వారిని ఉద్దేశించి సభాపతి మీరు అంతా ఈ దేశాన్నే అస్థిరపర్చదల్చుకున్నారు. ఈ సభ మీకో లెక్కా ? ఇక్కడ కూడా ఇదే పద్ధతికి దిగుతున్నారని, అయితే మీ చేష్టలకు ఈ సభను ప్రకంపనల కేంద్రం చేయనిచ్చేది లేదన్నారు. ఖర్గే వైపు చూస్తూ మీ పద్ధతి రాజ్యాంగాన్ని దెబ్బతీసేదిగా ఉంది. ఓ సభా మర్యాద లేదని, పద్ధతి లేదని అంటూ ఇదంతా కూడా రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల దురుసు వ్యవహారమే అవుతుందన్నారు. బిజెపి సభ్యులు తివారీ ఖర్గేకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు. బిజెపి సభ్యుడు పార్లమెంటరీ పరిభాషలోనే మాట్లాడారని, ఖర్గేను ప్రశంసించారని, అయినా దీనిపై రాజీ కుదిరింది కదా అని తెలిపారు. ఛాంబర్‌లో ఏమి చెప్పారో ఉన్నదున్నట్లుగా చెపుతారా అని ఖర్గే ధన్‌కర్‌ను ప్రశ్నించారు. అటువంటి అవసరం లేదని ఖర్గే చెప్పిన దశలోనే విపక్షం సభ నుంచి వాకౌట్ జరపడంతో సభ అర్థాంతరంగా చాలా వేడిగా వాడిగా ముగిసిపోయింది. ఈ దశలోనే సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# బ్రెజిల్‌లో కూలిన విమానం



- 62 మంది ప్రయాణికులు మృతి

**బలగం టీవి, బ్రెసిలియా**

బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకొన్నది. 62 మందితో వెళ్తున్న ఓ విమానం శుక్రవారం విన్హెడో పట్టణంలో కూలిందని స్థానిక టీవీ స్టేషన్ గ్లోబోన్యూస్ వెల్లడించింది. విమానంలోని ప్రయాణికులందరూ మృతిచెందినట్టు స్థానిక అధికారులు వెల్లడించారు. వోపాస్ లిన్హాస్ ఏరియాస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం పరన రాష్ట్రంలోని కాస్కవెల్ నుంచి సావో పౌలోలోని గువారుల్హోస్ వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని వెబ్‌సైట్ జీ1 పేర్కొన్నది. విన్హెడోలో విమానం కూలిన విషయాన్ని సావో పౌలో రాష్ట్ర అగ్నిమాపక విభాగం ధ్రువీకరించింది. ఘటనాస్థలికి బృందాలను పంపినట్టు తెలిపింది. విమాన ప్రమాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో పోస్టు అయింది. విమానం చెట్లలోకి పడిపోవడం, పెద్దయెత్తున నల్లటి పొగ ఆవరించడం కనిపించింది.



# ఏసీబీ వలలో రెవెన్యూ అధికారి

- గుట్టలు గుట్టలుగా బయటపడ్డ నోట్ల కట్టలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఓ మున్సిపల్ ఆఫీసులో పనిచేసే సూపరింటెండ్ ఇంట్లో నోట్ల కట్టలు గుట్టలు గుట్టలుగా బయటపడటం సంచలనంగా మారింది. ఏకంగా 7 కోట్ల రూపాయల వరకు అవినీతి సొమ్ము బయటపడటం చర్చనీయాంశమైంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ మున్సిపల్ ఆఫీసులో సూపరింటెండెంట్ గా పని చేస్తున్నారు దాసరి నరేందర్. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం రావటంతో.. ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. 2024, ఆగస్ట్ 9వ తేదీ రోజంతా సోదాలు చేయగా భారీగా సోమ్ము బయటపడింది.

దాసరి నరేందర్ ఇంట్లో.. అతని బంధువుల ఇండ్లల్లో ఏకంగా 2 కోట్ల 93 లక్షల 81 వేల రూపాయల డబ్బు బయటపడింది. డబ్బును కట్టలు కట్టి.. గుట్టలుగా పెట్టాడు నరేందర్. ఈ నోట్ల కట్టలు చూసి షాక్ అయ్యారు ఏసీబీ అధికారులు. అంతేనా.. దాసరి నరేందర్ బ్యాంక్ ఖాతాలో.. అక్షరాల కోటి 10 లక్షల రూపాయలున్నాయి. ఇంట్లోనే బీరువాల్లో అర కిలో బంగారం, స్థిరాస్తులకు సంబంధించి 17 డాక్యుమెంట్లు బయటపడ్డాయి. ఇప్పటి వరకు జరిగిన సోదాల్లో.. దాసరి నరేందర్ దగ్గర దొరికిన మొత్తం ఆస్తులు అక్షరాల 7 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఆదాయానికి మించి ఆస్తులు గుర్తించామని.. కేసు నమోదు చేశామని.. విచారణ కొనసాగుతుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన కవిత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి తీహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈడీ, సీబీఐ కేసుల్లో ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ బెయిల్ పిటిషన్‌పై అగస్ట్ 12న విచారణ జరగనుంది. ఆమె దాఖలు చేసిన పిటిషన్ సోమవారానికి లిస్ట్ అయింది. న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది. కవితకు బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు, ఢిల్లీ హైకోర్టు ఇదివరకు నిరాకరించాయి. ఢిల్లీ హైకోర్టు జులై 1న ఆమె బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మార్చి 15న హైదరాబాద్‌లో ఈడీ అరెస్ట్ చేసింది. ఆ తర్వాత తీహార్ జైల్లో ఉన్న కవితను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ రెండు కేసుల్లో ఆమెకు కింది కోర్టులు బెయిల్‌ను తిరస్కరించాయి. దాదాపు ఐదు నెలలుగా కవిత తీహార్ జైల్లో ఉంటున్నారు.

# గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితుల అరెస్ట్




- 3 కిలోల గంజాయి, రెండు మొబైల్స్ స్వాధీనం...
- ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్


**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**
అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, మూడు కిలోల గంజాయి రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండలానికి చెందిన క్రాంతి గంజాయి బానిసైన వారికి గంజాయి అమ్ముతూ సొమ్ము చేసుకునే వాడు.అందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా గాయిదిగూడ మండలం రూపావాడ గ్రామనికి చెందిన మాడవి దిగంబర్,తురంమ్ అమృత్ రావు లు అక్రమంగా గంజాయి తీసుకొని శుక్రవారం క్రాంతి కి అమ్మడానికి తంగళ్ళపల్లి గ్రామ శివారులో గల అంబా టెంపుల్ వద్దకు వస్తున్నారనే సమాచారం మేరకు తంగళ్ళపల్లి ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లగా అనుమానాస్పదంగా కనిపించగా, వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 3 కిలోల గంజాయి , రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశామని తెలిపారు.తంగళ్ళపల్లి మండలనికి చెందిన క్రాంతి కి అమ్మడానికి వచ్చామని, గతంలో కూడా గంజాయి తెప్పించుకున్నాడని తెలిపారని, మాధవి దిగంబర్,తురంమ్ అమృత్ రావు లను రిమాండ్ కి తరలించడం జరిగిందని, పరారీలో ఉన్న క్రాంతి ని త్వరలో పట్టుకుంటమని అన్నారు.

జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, గంజాయి కొన్న, సేవించిన, రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని అన్నారు.

**అక్రమ గంజాయి పై జిల్లా పోలీస్ ఉక్కుపాదం...**
యువత డ్రగ్స్ భారిన పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని,గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్ లు ,గంజాయి కిట్ల తో పరీక్ష లు నిర్వహిస్తూ అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నామని అన్నారు.2024 సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లాలో 54 కేసులలో 130 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 32 కిలోల 618 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనులు చేపడుతాం

- వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవి , వేములవాడ:**
ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయానికి రూ. 50 కోట్ల నిధులను కేటాయించిందని, మొదటి ప్రాధాన్యతలో రాజన్న ఆలయ విస్తరణ పనులను చేపడతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం వేములవాడ పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు.వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ నిధులు రూ. 30 లక్షలతో రాజరాజేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని అంబేద్కర్ చౌరస్తా నూతనంగా తీర్చిదిద్దే పనులకు, మురుగు నీరు రాజన్న ఆలయ గుడి చెరువులో కలవకుండా వేములవాడ మున్సిపల్ నిధులు రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం అనంతరం వీటిడీఏ నిధులు రూ. 2 కోట్లతో వేములవాడ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించిన పార్క్ లో ఏర్పాటు చేసిన ఫౌంటెన్ ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్క్ లో ఏర్పాటు చేసిన ఆట బొమ్మలు, పరికరాల ను పరిశీలించారు. పార్క్ ఆవరణలో ఆధునిక టెక్నాలజీతో టాయిలెట్స్ పురుషులు, మహిళల కోసం రెండు వేరువేరుగా నిర్మించాలని, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, స్నాక్స్ కోసం స్టాల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ సమీపంలో ఉన్న అంబేద్కర్ కూడలి వద్ద ఒక ఫౌంటెన్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఒక మినీ పార్కు లాగా తయారు చేస్తామని అన్నారు. గుడి చెరువులో కలుస్తున్న మురుగునీరు పట్టణ అవతలి వైపు నుండి తీసుకుపోవడానికి రూ.3 కోట్లతో భూమి పూజ చేసుకోవడం జరిగిందని అన్నారు.

**రాజన్న ఆలయానికి 50 కోట్ల నిధులు..**
వేములవాడ పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని,రాజన్న ఆలయానికి ప్రభుత్వం 50 కోట్ల నిధులను కేటాయించామని ఎమ్మెల్యే అన్నారు . రాజన్న ఆలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని వీలైనంత త్వరలో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు.గతంలో నేను శృంగేరి పీఠం ని దర్శించుకున్న సమయాన రాజన్న ఆలయ అభివృద్ధిపై వారితో చర్చించానని అన్నారు.పట్టణంలోని చిన్నారులకు మార్నింగ్, ఈవినింగ్ వాకర్స్ కు ఎంత ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్ రావు, కమిషనర్ అన్వేష్, వీటీడీఏ సెక్రటరీ అన్సారీ, తహసిల్దార్ అర్బన్ మహేష్ కుమార్, ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్రా, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి గ్రామం స్వచ్ఛంగా పచ్చగా ఉండాలి : ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
ప్రతి గ్రామం, పట్టణం పచ్చగా ఉండాలంటే,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్వచదనం.. పచ్చదనంలో భాగంగా ఆఖరి రోజు వన మహోత్సవాన్ని వేములవాడ అర్బన్ మండలం మారుపాక లో నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీఎఫ్ఓ బాలమణి తో కలిసి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అది శ్రీనివాస్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు, స్వచదనం.. పచ్చదనం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని మొదలు పెట్టిందని అన్నారు.ఇందులో భాగంగా జిల్లాలోని మొత్తం 255 గ్రామాలు, 2 మున్సిపాలిటీల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు.గ్రామాలు, పట్టణాల్లో నాటిన మొక్కలు సంరక్షించాలని, పచ్చదనంతోనే ఆక్సిజన్ స్థాయి పెరుగుతుందని,ప్రతి ఇంటి పరిసరాలు స్వచ్ఛంగా.. పచ్చగా ఉండాలని అని అన్నారు . స్వచదనం పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లా లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు . దీనికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమాల్లో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, డీఎం హెచ్ఓ వసంత రావు, అర్బన్ మహేష్ కుమార్, ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్రా, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## కార్యకర్తను పరామర్శించిన చల్మెడ



**బలగం టీవీ, వేములవాడ:**
వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లి గ్రామ బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త చెరుకు రవీందర్ రెడ్డికి ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరుగగా వారిని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు , సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డితో కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. వారి వెంట సీనియర్ నాయకులు ఏస తిరుపతి, బాల్ రెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు పొన్నం మహేష్, తలారి రవి తదితరులు ఉన్నారు.

# కేటీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదు..




- సిరిసిల్ల అభివృద్ధి, నేతన్నల సంక్షేమంపై నేతన్న చౌక్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా..
- బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్

**బలగం టీవీ , సిరిసిల్ల :**
పది సంవత్సరాల కాలంలో కేటీఆర్ సిరిసిల్ల లో చేసిన అభివృద్ధి, నేతన్నల సంక్షేమం కోసం చేసిన అభివృద్ధి పై సిరిసిల్లలోని వద్ద నేతన్న చౌక్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా అని బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ మాట్లాడుతూ 2014 కంటే ముందు సంక్షోభంలోనున్న వస్త్రా పరిశ్రమను ఆదుకోవాలని, సిరిసిల్ల నేత కార్మికుల వలసలు ఆపాలని , నేతన్నల కుటుంబాల్లో సంతోషాన్ని నింపాలని తీసుకువచ్చిన పథకమే బతుకమ్మ చీరలు పథకమని అన్నారు.ఒకప్పుడు చాలి చాలని జీతంతో జీవితం సాగిస్తున్న నేత కార్మికులకు, బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన బతుకమ్మ చీరాల పథకంతో నేడు నెలకు 20 నుంచి 25 వేల రూపాయలు జీతం పొందుతున్నాడని అన్నారు.

కార్మికుల లబ్ది కలిగేలా యారన్ మీద 10% సబ్సిడీ ఇచ్చి,అది కార్మికుల ఖాతాల్లోకి నేరుగా వెళ్లే విధంగా చేసి కార్మికుల బతుకుల్లో వెలుగులను నింపిన వ్యక్తి కేటీఆర్ అని అన్నారు.గత పది సంవత్సరాల్లో 14 నేత కార్మికులు చనిపోతే,తల 5 లక్షల రూపాయల ప్రభుత్వం పక్షాన సహాయం అందించింది అని,బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పది సంవత్సరాలు ఒకరోజు కూడా రాని పవర్లూమ్ 50% సబ్సిడీ సమస్య కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎందుకు వచ్చింది అని ప్రశ్నించారు.

సిరిసిల్లలో పద్మశాలీలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదని ఒకే ఒక కారణంతో పవర్లూమ్ సబ్సిడీలు గాని బతుకమ్మ చీరలు గాని ఎత్తివేసే కుట్ర చేస్తుంది అని అన్నారు. గతంలో పని లేక నేత కార్మికులు చనిపోతుంటే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మహేందర్ రెడ్డి నేత కార్మికులను నిరోధులు అమ్ముకొని బతకండి అని పద్మశాలి సామాజిక వర్గాన్ని మొత్తం కించపరిచే విధంగా మాట్లాడి,పద్మశాలి ల మనోభావాలను దెబ్బ తీయడం జరిగింది అని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పది సంవత్సరాలు బతుకమ్మ చీరలు ఆర్డర్ల కింద దాదాపు 3000 కోట్ల రూపాయలను సిరిసిల్లకి మంజూరు చేసిందని, నేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసిన కేటీఆర్ పై ఎవరు పడితే వారు ఇష్టమున్నట్టు మాట్లాడితే చూస్తూఊరుకునేది లేదని అన్నారు. సిరిసిల్ల పద్మశాలి లకు అందరికీ తెలుసు,కేటీఆర్ గనేత కార్మికుల కోసం ఏం చేశారు అని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలలోనే 12 మంది నేత కార్మికులు పని లేక ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని, దీనికి కాంగ్రెస్ పార్టీ నైతిక బాధ్యత వహించాల్సింది అని అన్నారు.

మళ్లీ ఒకసారి కేటీఆర్ ని విమర్శిస్తే కాంగ్రెస్ నాయకుల ను సిరిసిల్ల నియోజకవర్గం లో తిరగనివ్వమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ కె బాబా చారి, కట్ల రోహిత్, గజబిన్కార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంగా ఉన్నప్పుడే
# సమర్థవంతమైన సేవలు అందిస్తాం



- ఎస్పీ అఖిల్ మహాజన్.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**
పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండి ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.నమోదు అవుతున్న కేసుల వివరాలు, నమోదైన పలు కేసులు రికార్డ్ లు, స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని,ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని, డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించా లన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా పకడ్బందీగా 5 ఎస్ అమలు చేయడం జరుగుతుందని అన్నారు.స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఎలాంటి రోగాల బారిన పడకుండా, ప్రజాలకు సమర్ధవంతమైన సేవలు అందించగలం అని,పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా చెట్లను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ కృష్ణ, ఎస్ఐ లు శ్రీనివాస్,సిబ్బంది ఉన్నారు.

### రిలీవ్ కాని
# ఎస్జీటీల స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించాలి



**బలగం టీవీ, గంభీరావుపేట**
ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయడం ఎంతో హర్షణీయమని,ఇటీవల బదిలీలలో రిలీవ్ కానీ ఎస్జీటీల స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించి, వారిని వెంటనే రిలీవ్ చేయాలని టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్న గారి నారాయణ అన్నారు.శుక్రవారం గంభీరావుపేట మండలంలోని వివిధ పాఠశాలల్లో టిఆర్టిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, బోయన్నగారి నారాయణలు మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంగా పెండింగ్ ఉన్న ఉపాధ్యాయ పదోన్నతులు కల్పించడం ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ నియామకం మరియు కరెంటు బిల్లుల బాధ్యత ప్రభుత్వం తీసుకోవడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

పెండింగ్ లో ఉన్న చిన్నచిన్న సమస్యల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు బిఈడీ కలిగిన సీనియర్ ఎస్జిటి లకి అర్హత కల్పించలన్నారు. మిగిలిన పండిత, పిఈ టీ పోస్టుల అప్గ్రేడ్షన్, విద్యా వాలంటీర్లను నియమించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో గంభీరావుపేట మండల అధ్యక్షులు ముత్తయ్య గారి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి చిట్టంపల్లి బాలకిషన్, జిల్లా కౌన్సిలర్ శనిగరం రామచంద్రం, మండల కోశాధికారి గుడి కాడి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల అధ్యక్షునికి ఘన సన్మానం

**బలగం టీవీ, ముస్తాబాద్**
చీకోడ్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల నాయకులు గున్నాల రాజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన గూడూరు గ్రామానికి చెందిన వంగూరి దిలీప్ కి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి, ముఖ్య అతిథులుగా కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్ , కేటీఆర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో చికోడ్ గ్రామ శాఖ అధ్యక్షులు బనుక నాగరాజు , పార్టీ సీనియర్ నాయకులు కొప్పు లక్ష్మణ్ , యండి.జహంగీర్ , ముస్తాబాద్ టౌన్ యూత్ అధ్యక్షులు యాదగిరి , గ్రామ యూత్ అధ్యక్షులు పిట్ల ఎల్లం, గున్నాల గణేష్ గౌడ్, ఆశ సురేష్, యూత్ నాయకులు నరేష్, షరీఫ్,కిట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 502 దరఖాస్తులు

**బలగం టీవీ, హైదరాబాద్**
మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 502 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 112 , మైనారిటీ వెల్ఫేర్‌కు సంబంధించి 71 పౌరసరఫరాల శాఖకు సంబంధించి 69 , పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 42 , మున్సిపల్ శాఖకు సంబంధించి 35 ఇతర శాఖలకు సంబంధించి 173 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## టీ హబ్‌తో తమిళనాడు ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందం

**బలగం టీవీ, హైదరాబాద్**
విద్యా సంస్థల్లో ఆవిష్కరణల ప్రోత్సహించేందుకు తమిళనాడుకు చెందిన పీఎస్ఎన్ఏ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ టీ హబ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు తోపాటు ప్రతినిధుల బృందం తమిళనాడులోని కళాశాలను అక్కడి మేనేజ్‌మెంట్‌తో పాటు విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థుల్లో కళాశాల స్థాయిలోనే అంతర్ప్రెన్యూర్‌షిప్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు సొంతంగా ఆవిష్కరణలు చేసేలా కళాశాలతో కలిసి పనిచేస్తామని టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు తెలిపారు. ఒప్పందం వల్ల వేలాది మంది విద్యార్థులతో టీ హబ్ కలిసి పనిచేసేందుకు అవకాశం ఉందన్నారు.





## క్రికెటర్ సిరాజ్‌కు ఇంటిస్థలం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రికెటర్ ముహమ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో సిరాజ్ సభ్యుడు. క్రికెటర్‌కు హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్ లో రోడ్ నెం. 78లో 600 చదరపు గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇటీవల టి20 ప్రపంచ కప్ సాధించిన తర్వాత నగరానికి చేరుకున్న సిరాజ్ జుబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రికి టీమిండియా జెర్సీని బహూకరించారు. ఈ సందర్భంగా సిరాజ్‌కు ఇంటిస్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. తాజాగా ఇంటిస్థలం కేటాయిస్తూ జీవో జారీ చేశారు.

# సిల్వర్‌కు వినేశ్ అర్హురాలే

- **సచిన్ టెండూల్కర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

2024 పారిస్ ఒలింపిక్స్‌లో వివాదాస్పద రీతిలో అనర్హత వేటు ఎదుర్కొన్న స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ మద్దతు తెలిపాడు. దీనికి సంబంధించి శుక్రవారం సచిన్, సోషల్ మీడియా ట్విట్టర్‌లో ఓ ట్వీట్ చేశారు. దీనికి 'టైమ్ ఫర్ అంపైర్స్ కాల్' అనే టైటిల్ పెట్టాడు. వినేశ్ రజత పతకానికి అర్హురాలని సచిన్ అభిప్రాయపడ్డాడు.

'ప్రతి క్రీడకు నియమాలు ఉంటాయి. ఆ నియమాలను సందర్భానుసారంగా చూడాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మళ్లీ పరిశీలించాల్సిన వస్తుంది. వినేశ్ ఫోగాట్ ఫైనల్స్‌కు ఫెయిర్ అండ్ స్క్వేర్‌గా అర్హత సాధించింది. ఆమె అధిక బరువుతో డిస్‌క్వాలిఫై అయింది ఫైనల్స్‌కి ముందు మాత్రమే. కానీ ఆమె సిల్వర్ మెడల్‌ని లాక్కోవడంలో లాజిక్, స్పోర్టింగ్ సెన్స్ లేవు' అని సచిన్ ట్వీట్‌లో పేర్కొన్నాడు.

పెర్ఫార్మెన్స్ మెరుగు పర్చుకునేందుకు డ్రగ్స్ ఉపయోగిస్తే అనర్హత వేటు వేయడంలో అర్థం ఉందని సచిన్ పేర్కొన్నాడు. అయితే వినేశ్ చాలా చక్కటి ప్రదర్శనతో ఫైనల్స్‌కు చేరుకుందని, ఆమె సిల్వర్ మెడల్‌కి అర్హురాలని సచిన్ అభిప్రాయపడ్డాడు.





సచిన్ ట్వీట్‌కి కొన్ని నిమిషాల్లోనే సోషల్ మీడియా యూజర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈ ట్వీట్‌ని కేవలం 1.30 గంటల్లో 4.34 లక్షల మందికిపైగా చూశారు. 26 వేల మందికిపైగా లైక్ చేశారు. చాలా మంది నెటిజన్లు సచిన్ వాదనను సమర్థిస్తూ కామెంట్లు చేస్తున్నారు.

వినేశ్ ఫోగట్ తన అనర్హతపై స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ కోర్ట్‌లో అప్పీల్ చేసింది. షేర్డ్ సిల్వర్ మెడల్ అందజేయాలని కోరింది. దీనిపై పారిస్ లో విచారణ జరుగుతోంది. ఒలింపిక్ క్రీడలు ముగిసేలోపు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

అయితే మహిళల ఫ్రీ స్టైల్ రెజ్లింగ్ 50 కేజీల విభాగం ఫైనల్స్‌కి ముందు వినేశ్ ఫోగట్ 100గ్రాముల అధిక బరువు ఉన్న కారణంగా ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు. ఫైనల్స్ అవకాశం లేకుండా, ఏ పతకం లేకుండా వినేశ్‌ని ఇంటకి పంపడంపై ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. అంతర్జాతీయ రెజ్లింగ్‌కి రిటైర్మెంట్ ప్రకటించింది.

# ఎన్టీఆర్-నీల్ మూవీ ప్రారంభం



- **2026 జనవరి 9న థియేటర్స్ లోకి..**

**బలగం టీవీ, హైదరాబాద్**

స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ కలిసి చేస్తున్న కొత్త సినిమా పూజా కార్యక్రమాలతో అట్టహాసంగా ప్రారంభమైంది. దర్శకుడు నీల్ సలార్ అనంతరం వెంటనే ఈ ప్రాజెక్టును సెట్స్ పైకి తీసుకు రావడం హాట్ టాపిక్ గా మారింది. రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈ ప్రారంభ వేడుకకు ఇరు కుటుంబసభ్యులు, పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు.ఎలాంటి హడావుడి లేకుండా సినిమాను లాంచ్ చేయడం విశేషం. ఇక ఈ చిత్రానికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి, ప్రశాంత్ నీల్, "కేజీఎఫ్" మరియు "సలార్" వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన తరువాత, ఎన్టీఆర్‌తో కలిసి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.ప్రత్యేకంగా ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్‌ని ఏ విధంగా చూపిస్తారన్నది అభిమానుల్లో తారస్థాయికి చేరుకుంది. ఇప్పటికే ఎన్టీఆర్ అభిమానులు, ఈ చిత్రాన్ని అత్యంత భారీ అంచనాలతో ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందనుకునే ప్రేక్షకులకు ప్రశాంత్ నీల్ కొన్ని కొత్త విషయాలను తెలియజేశారు.

"నిజానికి ఇది యాక్షన్ సినిమాగా మాత్రమే ఉండదని, ఇందులో బలమైన ఎమోషన్స్, వైవిధ్యభరితమైన కథాంశం ఉంటుందని" ఆయన వెల్లడించారు. ఇది తనకు కూడా కొత్త తరహా కథ అని, ఈ ప్రాజెక్ట్ తనకు సవాలుగా ఉందని ప్రశాంత్ నీల్ తెలిపారు. ఇక 'ఎన్టీఆర్ 31' వర్కింగ్ టైటిల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ చిత్రానికి "డ్రాగన్" అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది.

ఇక ప్రారంభ కార్యక్రమం అనంతరం మేకర్స్ రిలీజ్ డేట్ సంబంధించి బిగ్గెస్ట్ అప్డేట్ ని అందించారు. దీనితో ఈ చిత్రం 2026 జనవరి 9న థియేటర్స్ లోకి రాబోతున్నట్టుగా ఇప్పుడు మేకర్స్ అనౌన్స్ చేసేసారు. దీనితో ఈ భారీ చిత్రం నుంచి మాస్ ఫీట్ అప్పటికి లాక్ అయ్యింది అని చెప్పాలి. ఇక ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ అలాగే ఎన్టీఆర్ ఆర్ట్స్ వారు సంయుక్తంగా నిర్మాణం వహిస్తుండగా ఈ చిత్రాన్ని కూడా పీరియాడిక్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లోనే తెరకెక్కిస్తున్నట్టుగా తెలుస్తుంది.






## హీరోగా దివంగత జానకీరామ్ తనయుడు

**బలగం టీవీ, హైదరాబాద్**

హరికృష్ణ మనవడు, దివంగత జానకీరామ్ తనయుడు నందమూరి తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ సీనియర్ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఓ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై యలమంచిలి గీత నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్‌ను ప్రకటించారు.తెలుగమ్మాయి వీణ రావు హీరోయిన్‌గా నటించనుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం, చంద్రబోస్ సాహిత్యాన్ని అందించబోతున్నారు. సాయిమాధవ్ బుర్రా సంభాషణల రచయిత. ఈ సందర్భంగా దర్శకుడు వైవీఎస్ చౌదరి మట్లాడుతూ 'కీరవాణిగారు యుగపురుషుడులాంటి వారు. ఆయన నాకు మర్చిపోలేని పాటలు అందించారు. అలాంటి గొప్ప వ్యక్తితో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. చంద్రబోస్ సాహిత్యం అద్భుతంగా ఉండబోతున్నది. సాయిమాధవ్ బుర్రా ప్రతి సినిమాకు గొప్పగా ఎదిగారు. ఆయన మా చిత్రానికి మాటలు రాయడం ఆనందంగా ఉంది. మంచి కూచిపూడి డ్యాన్సర్ అయిన తెలుగమ్మాయి వీణ రావుని కథానాయికగా పరిచయం చేస్తున్నాం' అన్నారు. కీరవాణి, చంద్రబోస్, వైవీఎస్ చౌదరి వంటి గొప్ప వ్యక్తులతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని సాయిమాధవ్ బుర్రా పేర్కొన్నారు.

## తమిళ హీరో సూర్యకు ప్రమాదం

**బలగం టీవీ, హైదరాబాద్**



జిగర్‌తండా డబుల్ ఎక్స్ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజు, సూర్య కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'సూర్య 44' గా వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ అండమాన్‌లో కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్‌ను ఊటీలో జరుపుకుంటుంది. అయితే ఈషూటింగ్ సమయంలో ప్రమాదం జరగడంతో సూర్య తలకు గాయం అయినట్లు తెలుస్తుంది. వెంటనే అప్రమత్తం అయిన చిత్రయూనిట్ గాయపడిన సూర్యను స్థానిక ఆసుపత్రికి తరలించారని తెలుస్తోంది. కాగా ఈ విషయంపై నిర్మాత రాజశేఖరన్ పాండియన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. డియర్ ఫ్యాన్స్ ఇది చిన్న గాయం. దయచేసి చింతించకండి, సూర్య ఇప్పుడు కోలుకున్నాడు. మీ అందరి ప్రేమ, ప్రార్థనలతో బాగున్నాడు ఆందోళన చెందొద్దంటూ విజ్ఞప్తి చేశారు.మరోవైపు, సూర్య నటించిన 'కంగువ' సినిమా అక్టోబరు 10న విడుదల కానుంది.